# 13. విలువైనవి

**నేపథ్యం:** పుట్టిన రోజునాడు ఎలాంటి బహుమతులు ఇస్తే బాగుంటుందని నీ అభిప్రాయం?
బహుమతి వెల గొప్పదా? దాని విలువ గొప్పదా చర్చించండి.
కింది పాఠంలో రాణి స్నేహితురాలికి వాళ్ళమ్మ ఏం బహుమతి ఇవ్వమని చెప్పిందో తెలుసుకుందామా?

రాణికి పదేళ్ళు. ఒక రోజు "అమ్మా ఈ రోజు నా స్నేహితురాలు రూప పుట్టిన రోజు కదా. ఏం తీసుకెళ్ళను" అంది ఉత్సాహంగా. అందరికంటే ఖరీదైనది తీసుకెళ్ళాలి అని అనుకుంది. అప్పుడే కదా గొప్ప అందరిలో.

అమ్మ ఒక పాకెట్ తెచ్చి ఇచ్చింది. ""ఏమిటమ్మా ఇది" అడిగింది.

"నీతి కథల పుస్తకాలు, బాల సాహిత్యం పుస్తకాలు పిల్లల భవిష్యత్తుకు పునాది వంటివి. మంచి సాహిత్యం చదవడం వలన పిల్లల్లో మంచి వ్యక్తిత్వము ఏర్పడుతుంది" అంది.

రాణికి చిరాకు వచ్చింది. "అమ్మా ఇంత చౌకైన బహుమతా? నా స్నేహితులు నవ్వుతారు. వాళ్ళు వెండి వస్తువులు, డ్రస్సులు తెస్తున్నారు. మనమేమో ఇలాంటివి ఇస్తే ఎలా" అంది.

"ఇష్టమైతే ఇవి తీసుకెళ్ళు. లేకపోతే లేదు". అంటూ అమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

రాణి కాసేపు అలాగే నిలబడిపోయింది. ఏడుపు కూడా వచ్చింది. కానీ ఏం చేస్తుంది? అమ్మ మాట అందంటే అంతే. ఇంక ఎంత చెప్పినా వినదు. అయినా మన ముందర విప్పి చూస్తారా ఏమిటి అనుకుని అవే పట్టుకెళ్ళింది. పార్టీ మానటం ఇష్టం లేదు.



**సొంతవాక్యాలు:–** ● భవిష్యత్తు ● బహుమతి ● వారించు ● ఆకర్షణీయం

అందరూ బహుమతులు అందజేస్తున్నారు. అయితే రూప ప్రక్కన నిలబడిన రూప తమ్ముడు ఉత్సాహంగా పాకెట్లు తెరిచి చూస్తున్నాడు. రూప అమ్మ వారిస్తున్నా వినటం లేదు. చాలా వరకు విలువైన బహుమతులు, బొమ్మలు ఉన్నాయి.

రాణి బాధపడుతూనే తన బహుమతి ఇచ్చింది. అవమానం తప్పదనుకుంది.

కానీ చిత్రంగా ఆ పుస్తకాలు రూప, రూప తమ్మునికేకాక అందరికీ నచ్చాయి. రంగురంగుల బొమ్మలతో కథలు ఆకర్షణీయంగా ఉన్నాయి. అప్పుడే పిల్లలు అడిగి ఒకటి, రెండు చదివేశారు కూడా. రూప ఫ్రెండు రాధిక ఒక కథ చదివి "చూశావా అబద్ధాలాడితే ఎన్ని తిప్పలో" అన్నది.

"పెద్దల మాట వినకపోతే ఎంత నష్టపోతామో ఈ కథ చదివితే తెలుస్తుంది." అంటోంది జూలీ మరో స్నేహితురాలు. రాణికి చాలా సంతోషం వేసింది. రూప అమ్మ కూడ "మంచి బహుమతి తెచ్చావమ్మా" అని మెచ్చుకుంది.

రాణి ఇంటికొచ్చి సంతోషంగా విషయమంతా తల్లికి చెప్పింది. అమ్మ అంది పిల్లలకి బహుమతిగా డబ్బులిస్తే చెడిపోయే అవకాశాలున్నాయి. ఖరీదైన బహుమతులు పిల్లలలో బేధాల్ని చూపుతాయి.

తినేదిస్తే ఎంత ఖరీదైనా తినంగానే మర్చిపోతారు. అందుకే పుస్తకాలు ఇచ్చాను. అవి శాశ్వతమైన బహుమతులు. పిల్లలకి ముఖ్యంగా ఈ రోజుల్లో సాహిత్యం విలువ, పఠనాసక్తి పోయింది. అయితే పిల్లల మానసిక ఎదుగుదలకి మంచి పుస్తకాలు చదవటం తప్పనిసరి. అందుకే అవి బహుమతిగా ఇచ్చాను అంది అమ్మ.

**ఉక్తలేఖనం:–** • ఉత్సాహం • సాహిత్యం • వ్యక్తిత్వం • శాశ్వతం • పుస్తకం • భవిష్యత్తు

## I. వినండి–చెప్పండి

1. మన దేశంలో ప్రజలందరూ ఏయే మహనీయుల పుట్టిన రోజులు జరుపుకుంటారు?
2. నీకు పుస్తకాలంటే ఇష్టమేనా? నీకిష్టమైన పుస్తకాలేంటి?

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.

### అ. ఒక్కొక్క వాక్యంలో సమాధానం రాయండి.

1. రాణి ఎవరి పుట్టిన రోజుకు వెళ్ళాలనుకొన్నది?
2. రాణి తల్లి రూపకి ఇవ్వటానికి ఏం బహుమతి తెచ్చింది?
3. రూప తమ్ముడు ఏం చేశాడు?
4. రూప తల్లి రాణిని ఏ విధంగా మెచ్చుకుంది?

### ఆ. మూడు, నాలుగు వాక్యాల్లో సమాధానం రాయండి.

1. రాణి బహుమతి చూడగానే పిల్లలు ఏం చేశారు?
2. పుస్తకాలు చదివిన స్నేహితులు ఏవిధంగా స్పందించారు?
3. రాణి సంతోషంగా చెప్పిన విషయాన్ని విని తల్లి ఏమంది?

## III. భాషావగాహన

### అ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. అమ్మా! ఈరోజు నా స్నేహితురాలు <u>రూప</u> పుట్టినరోజు.
2. అమ్మ ఒక ప్యాకెట్ తెచ్చి <u>ఇచ్చింది</u>.
3. <u>మంచి</u> సాహిత్యం చదవటం వలన మంచి వ్యక్తిత్వం ఏర్పడుతుంది.
4. <u>అవి</u> శాశ్వతమైన బహుమతులు.

ఆ. అడిగిన విధంగా రాయండి.

1. అమ్మ ఇచ్చిన బహుమతి పాకెట్‌లోనివి

2. మంచి సాహిత్యం చదవడం వలన ఉపయోగాలు.

## IV. సృజనాత్మకత

అ. అడిగిన విధంగా పూరించండి.

| | |
|---|---|
| నెహ్రూ పుట్టిన రోజు | బాలల దినోత్సవం |
| సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు | |
| మౌలానా అబుల్ కలాం పుట్టిన రోజు | |
| ఎ.పి.జె. అబ్దుల్ కలాం పుట్టిన రోజు | |

మహారాష్ట్రలో बुके नको, बुक द्या (బుకే నకో, బుక్ ద్యా) అనే నినాదం ప్రచారంలో వుంది. అంటే "పుష్పగుచ్ఛం వద్దు, పుస్తకాన్ని ఇవ్వు". దీనిని విద్యావిభాగంలో చాలా మంది అనుసరిస్తున్నారు. అలాగే చాలామంది పుష్పగుచ్ఛానికి బదులుగా మంచి మొక్కని బహుకరిస్తున్నారు. ● దీనిని గురించి ఒక నినాదాన్ని రాయండి. ● బొమ్మలు గీయండి.

గ్రంథాలయ సమయం:–



- అంతర్జాలంలో లభించు తెలుగు పుస్తకాలు చదవండి.
- గ్రంథాలయం, అంతర్జాలాలలో మీరు చదివిన పుస్తకాల జాబితాను తయారు చేయండి.

**మంచి పుస్తకాలు ప్రపంచపు అందాన్ని చూడగలిగేలా చేసే కన్నులు.**

**ఇ. పుస్తకం/మొక్కను ఎవరెవరికి బహుకరించవచ్చో ఆకృతిలో రాయండి.**

పుస్తకం/మొక్కను బహుకరిస్తాము.

| | | | | |
|---|---|---|---|---|
| | పాఠశాలకు వచ్చిన అతిథికి | | | |

**ఈ. పుస్తకాల ప్రయోజనాలను కింది ఆకృతిలో పూరించండి.**

పుస్తకాల ప్రయోజనాలు

| | | | |
|---|---|---|---|
| | | | |

**– అవగాహన చేసుకుందాం. అనువాదం చేద్దాం.**

**ప్రక్కనున్న జనజాగృతి సూచనాఫలకాన్ని శ్రద్ధగా చదవండి. అందులో ఏమి వ్రాసి ఉందో తెలుగులో చెప్పండి. రాయండి.**

______________________

______________________

______________________

______________________

______________________

______________________

______________________




YHLRC1

**– కింది పరిచ్ఛేదాన్ని అవగాహనతో చదవండి. దానికి తగిన శీర్షికను పెట్టండి.**

జనపదము అనగా పల్లె అని అర్థం. ఈ పల్లె ప్రజలే జానపదులు. వారు పాడుకునే పాటలను జానపద గీతాలని, వారు ప్రదర్శించే కళారూపాలను జానపద కళారూపాలనీ, వారు చెప్పే కథలను జానపద కథలనీ అంటారు.

జానపద కళలను మూడు విభాగాలుగా విభజించారు. అవి.

**1. జానపద సంగీతం, 2. జానపద నృత్యం, 3. జానపద రూపకం (నాటకం).**

హరికథలు, బుర్రకథలు, తోలుబొమ్మలాటలు, పగటివేషాలు మొదలగునవి పేర్కొనదగిన జానపద కళలు.

**నేనివి తెలుసుకున్నాను.**

- ఎక్కువ డబ్బుపెట్టికొన్న వస్తువులే విలువైనవి అని అనుకోరాదు.
- మంచి పుస్తకాలు, మొక్కలు వంటి బహుమానాల విలువ, అవి ఇచ్చే ఆనందాన్ని గణించలేము.